
నీలాయిపల్లిలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీ


రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు


గ్రామంలోని పల్లె ప్రకృతి వనం

# అభివృద్ధి పథంలో నీలాయిపల్లి

### 2014 వరకు ఒక్క సీసీ రోడ్డు లేదు..



2014 వరకు నీలాయిపల్లిలో ఒక్క సీసీ రోడ్డు కూడా లేదు. ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే పల్లె ప్రగతితో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు దశల వారీగా నిర్మించినం. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వెంటనే స్థానిక బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులు చేపట్టాం, వారి సహకారం మరువలేనిది. అన్ని విధాలుగా అండగా ఉంటున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**-రేపాక సునీత, సర్పంచ్ నీలాయిపల్లి, తాండూర్**

### ప్రజల సహకారంతోనే అభివృద్ధి..



ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి ప థంలో ముందుకు నడిపిస్తున్నాం. ప్రభుత్వ నిధులను సద్వి నియోగం చేసుకుంటూ అవసరమున్న పనులను దశలవారీగా చేపడుతున్నాం. పల్లె ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించినం. గ్రామంలో ఇబ్బందులకు ఆస్కారం లేకుండా అన్ని వర్గాలతో సమష్టిగా కృషి చేస్తున్నాం.

**-రమ, పంచాయతీ కార్యదర్శి, నీలాయిపల్లి, తాండూర్**


గ్రామంలోని డంప్ యార్డు


నీలాయిపల్లి, ఒడ్డెర కాలనీలో వేసిన సీసీ రోడ్డు

- **రూ.44 లక్షలతో అభివృద్ధి పనులు**
- **ఎటుచూసినా సీసీ రోడ్లు,**
- **ఆహ్లాదకరంగా ప్రకృతి వనం**

తాండూర్, అక్టోబర్ 12 : సమైక్యాంధ్ర పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గ్రామాలు నేడు ప్రగతిపథంలో దూసుకెళ్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పల్లె ప్రగతితో పల్లెల రూపురేఖలే మార్చింది. గతంలో నీలాయిపల్లి తాండూర్ పంచాయతీ పరిధిలో ఉండేది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటు చేయడంతో నీలాయిపల్లి నూతన జీపీగా ఏర్పడింది. ఇప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు.

### స్వచ్ఛ గ్రామంగా..

నీలాయిపల్లి గ్రామం ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. గ్రామపంచాయతీ పరిధిలో 19 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. అలాగే ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేయడంతో గ్రామం పూర్తిగా స్వచ్ఛతగా మారింది.

### చేపట్టిన పనులు..

గ్రామంలో 120 గృహాలు, 680 మంది జనాభా ఉండగా, 310 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిధులతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో వచ్చిన నిధులు రూ.44లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. రూ.2.50 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు. రూ.1.50 లక్షలతో పల్లె ప్రకృతివనం. రూ.5 లక్షలతో ట్రాక్టర్ ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు. రూ.11లక్షలతో వైకుంఠధామం నిర్మాణం. రూ. 2.40లక్షలతో నర్సరీ ఏర్పాటు చేశారు. రూ 4.24లక్షలతో ఎవెన్యూ ప్లాంటేషన్, రూ. 64 వేలతో తెలంగాణ క్రీడా ప్రాంగణం, రూ.3.14లక్షలతో సోక్ పిట్ నిర్మించా రు. అలాగే ఇంటింటికీ తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశా రు.

### రూ. 26 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు..

నీలాయిపల్లి, ఒడ్డెరకాలనీలో రూ. 26 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో జడ్పీ, మండల నిధులు, ఉపాధిహామీ, మైన్స్, ఎంపీ ల్యాడ్స్ నుంచి గ్రామానికి నిధులు తీసకొచ్చి అన్ని కాలనీలకు సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. అన్ని కాలనీల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి మూడో తీగను అమర్చారు. అన్ని విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు వేశారు. హరితహారంలో భాగంగా ప్రధాన రహదరారులకిరువైపులా మెక్కలు నాటి వాటి సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. గ్రామ జనాభాను బట్టి పంచాయతీకి ప్రభుత్వం నుంచి నెలవారీ మెయింటనెన్స్ కింద వచ్చే డబ్బులతో గ్రామాన్ని మల్టీ పర్పస్ సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో గ్రామం శుభ్రంగా కనిపిస్తున్నది. చేస్తున్నారు.

# కార్మిక కాలనీల్లో దసరా వేడుకలు



యైటింక్లయిన్ కాలనీ : మాట్లాడుతున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 24 : పట్టణంలో దసరా పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం రాత్రి వేంకటేశ్వర ఆలయం, షాపింగ్ కాంప్లెక్స్, వరసిద్ధి వినాయక మండపం, జయశంకర్‌నగర్, మహాత్మాగాంధీ నగర్, ఓసీపీ1 రోడ్డు, పోతనకాలనీలో జరిగిన వేడుకల్లో పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్, ఆర్జీ-2 డీజీఎం (ఎ) ఎర్రన్న ముఖ్య అతిథులుగా పాల్గొని శమీ పూజ నిర్వహించారు. అనంతరం వైకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాంలీలా కార్యక్రమంలో వారు పాల్గొని రావణాసూరుడి ప్రతిమను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలను ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకుంటారన్నారు. అలాంటి వేడుకలను షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుర్తింపు సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, చెరుకు ప్రభాకర్ రెడ్డి, వైకే ఫౌండేషన్ సభ్యులు బెల్లంకొండ విజేందర్‌రెడ్డి, పాశం ఓదెలు యాదవ్, వేణుగోపాల్, వెంకటేశ్, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గోలేటిటౌన్‌షిప్‌లో..

రెబ్బెన, అక్టోబర్ 24 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ కార్మిక క్షేత్రంలో సింగరేణి ఆధ్వర్యంలో దసరా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయం నుంచి దేవతామూర్తులతో ఊరేగింపుగా శ్రీ భీమన్న క్రీడా మైదానం వరకు వెళ్లి మైదానంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ ఆధ్వర్యంలో శమీ పూజలు నిర్వహించారు. అనంతరం పటాకులు కాలుస్తూ రావణసూరుడి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


రెబ్బెన : గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో దహనమవుతున్న రావణాసురుడి బొమ్మ

## బీఆర్ఎస్‌తోనే సింగరేణి మనుగడ

గోదావరిఖని, అక్టోబర్ 24 : బీఆర్ఎస్‌తోనే సింగరేణి సంస్థ, కార్మికులకు మనుగడ ఉంటుందని ఆ పార్టీ నాయకుడు మాదాసు రాంమ్మూర్తి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణి గనులు మూతపడి కార్మికుల సంఖ్య రోజురోజుకూ తగ్గి నష్టాల ఊబిలోకి వెళ్లిందన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రద్దయిన వారసత్వ ఉద్యోగాలను సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల ద్వారా ఇప్పటికే 16 వేల మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇచ్చి 20 వేలుగా ఉండే కార్మికుల సంఖ్యను 40 వేలకు తీసుకువచ్చారన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బాయిబాట పట్టి సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారన్నారు. నాడు కాంగ్రెస్ హయాలో కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదనీ, ఆర్ఎఫ్‌సీఎల్ మూతపడితే ఏం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికలు రాగానే వచ్చి పరిశ్రమలను తీసుకువస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మేడిపల్లి ఓసీపీ జీవిత కాలం ముగిశాక కార్మికులు ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదనే ఉద్దేశంతో ఈ ప్రాంత మనుగడ కోసం తాము పర్యావరణ హిత ఓసీపీ-5గా చేపట్టేందుకు కృషి చేశామన్నారు. కానీ కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ, ఇతర జాతీయ కార్మిక సంఘాలు ఓసీపీ-5కి తాము వ్యతిరేకం కాదని సంతకాలు చేసి ఇప్పుడు ఓసీపీ-5 వల్ల బొందలగడ్డగా మారుతుందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంకా ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఐటీ పరిశ్రమను తీసుకవస్తున్నాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే నూతన పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయనీ, కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేయవద్దని కోరారు. పార్టీ నాయకులు పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, పర్లపల్లి రవి, మొగిళి, రత్నాకర్, సంతోష్ పాల్గొన్నారు.